బయోడైవర్సిటీ పార్కుపై

చిగురించిన ఆశలు


గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ పార్కు ఇదే

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన

రాయదుర్గం: ప్రపంచ జీవవైవిధ్య సదస్సుకు గుర్తింపుగా అప్పటి ప్రధాని మన్‌మోహన్‌సింగ్ చేతుల మీదుగా ప్రారంభించిన పార్కు ఇది. రాయదుర్గంలోని సర్వేనంబరు 83లోని 15 ఎకరాల స్థలంలో అక్టోబర్ 16- 2012న ప్రారంభించారు. దీనికి బయోడైవర్సిటీ పార్కుగా నామకరణం చేశారు. తదనంతరం దీనిని పట్టించుకునే వారే కరువయ్యారు.

పత్తాలేని మ్యూజియం, ఎక్వేరియం నిర్మాణం

- బయోడైవర్సిటీ పార్కుకు కేటాయించిన 15 ఎకరాల స్థలంలో రూ.100 కోట్లతో జీవ వైవిధ్య మ్యూజియం, రూ.400 కోట్ల వ్యయంతో ప్రత్యేక ఎక్వేరియం నిర్మించాలని అప్పట్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.
- అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అక్టోబర్ 22, 2012న జూబ్లీహిల్స్‌లో కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ప్రకటించారు.
- మొదట్లో బయోడైవర్సిటీ పార్కును న్యూఢిల్లీలో ఏర్పాటు చేయాలని అనుకున్నారు. కానీ అప్పటి కేంద్ర అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శి ఛటర్జీ రూ.100 కోట్లతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో....

రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ బయోడైవర్సిటీ పార్కుపై ఆశలు చిగురిస్తున్నాయి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాటు చేసిన పార్కు కావడంతో దీనికి ప్రాధాన్యం ఇస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు. రోడ్డు విస్తరణలో కొంత స్థలం పోయినా ఉన్న స్థలంలో పార్కును ఆహ్లాదంగా, పచ్చదనంతో కూడిన వాతావరణం వెల్లివిరిసేలా చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని దీన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణల తొలగింపు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్ కాలనీలో 40 అడుగుల రోడ్డును ఆక్రమించి ర్యాంపులు, సన్ షెడ్స్, టిఫిన్, టీ సెంటర్‌లు ఏర్పాటు చేయటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషకు ఫిర్యాదులు అందటంతో, ఆమె ఆదేశాల మేరకు గురువారం గోపాల్‌నగర్‌లో నిర్మించిన ఆక్రమణలను తొలగించారు. ఏసీపీ మల్లేశ్వర తదితరులు ఆక్రమణలను తొలగించారు.

ఫారెస్ట్ అకాడమీలో అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ గిరిధర్‌రెడ్డి

జీడిమెట్ల: వేసవిలో అటవీప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పి.గిరిధర్‌రెడ్డి అన్నారు. గురువారం దూలపల్లిలోని రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై ట్రైనింగ్‌లో ఉన్న అటవీ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి డీఎఫ్‌వో గిరిధర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ వేసవికాలంలో అటవీప్రాంతంలో ఎండిన ఆకులు ఎక్కువగా ఉండటంతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటాయని దీని కోసం సిబ్బంది ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని కోరారు. అకాడమీలో ట్యాంకుల్లో నీటి నిల్వలు ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, జీడిమెట్ల ఎస్ఎఫ్‌వో సుభాష్‌రెడ్డి, ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ఎంపీపీ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవంను నిర్వహించారు.ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని వివిధ స్థాయిల్లో మహిళా ఉద్యోగులకు ముగ్గులు, కుర్చీల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీడీఓ అరుణలు బహుమతులను అందించారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు జానాబాయి, లావణ్య, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నాగరత్నం, మాస్టర్ ట్రైనర్ యోగిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి గ్రూప్ కొత్త ప్రాజెక్టులు ప్రారంభం

ఆవిష్కరించిన సినీ హీరో విక్టరీ వెంకటేష్



రాయదుర్గం: రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి వాసవి గ్రూప్ ప్రాజెక్టులను ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడర్, సినీహీరో విక్టరీ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ రంగంలో వాసవి గ్రూప్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అలాగే యాడ్ ఫిల్మ్‌ను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసవి గ్రూప్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎర్రమ్ విజయకుమార్, ప్రతినిధి అభిషేక్, ఇతర సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి.. ఏర్పాట్లు పూర్తి

ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, కల్యాణాలు


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో..

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని పలు శివాలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

శివసాయిక్షేత్రంలో ..

గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 11.45 గంటల వరకు ప్రత్యేకంగా భక్తులు కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేసేందుకు అవకాశం కల్పిస్తారు. 8 గంటలకు మహా శివలింగం అభిషేకం, 9 గంటలకు అష్టోత్తర శత కలశస్థాపన, 12 గంటలకు ప్రత్యేక అలంకారం, నైవేద్యం, మంత్ర పుష్పం,1.30 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటలకు దర్శనం, అర్చన. అనంతరం ప్రదోషకాల అభిషేకం, రాత్రి 10 గంటలకు శివ కళ్యాణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు స్థాపిత కలశ జలాలతో అభిషేకం, 12.30 గంటలకు అన్నాభిషేకం, 1 గంటకు ప్రత్యేక హారతి ఇస్తారు. అలాగే జీపీఆర్ఏ క్వార్టర్స్ ఆలయం, సాయిదత్త గణపతి ఆలయం, ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ హనుమాన్‌ధామ్ ఆశ్రమంలో భక్తులు స్వహస్తాలతో శివలింగానికి అభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

శాంతిసరోవర్‌లో ఉత్సవాలు ప్రారంభం

గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 10వ తేదీ వరకు రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు కొనసాగుతాయి. అందులో భాగంగా రామేశ్వరం ఆలయ దర్శనం చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, రోజూ రాత్రి 7.30 గంటలకు మహా హారతి ఇస్తారు. ఈ సందర్భంగా స్పిరిచ్యువల్ ఎగ్జిబిషన్, స్టేజ్ డ్రామాలు, మెడిటేషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, వాల్యూ లెర్న్ గేమ్స్ ఏర్పాటు చేశారు.



మహిళలు అన్ని రంగాల్లో

రాణిస్తున్నారు


భెల్ టౌన్‌షిప్‌లోని బీవీబీ పబ్లిక్ స్కూల్లో మహిళా దినోత్సవం

గచ్చిబౌలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శేరిలింగంపల్లి వ్యాప్తంగా పలుచోట్ల వేడుకలు నిర్వహించుకున్నారు. కొండాపూర్ బెటాలియన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ సీతారాం,పార్థసారధిరెడ్డి,ఏఓ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో..

హఫీజ్‌పేట్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని ఇంద్రజిత్‌గుప్తా హాల్‌లో మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌పీసీఎల్ మహిళా అధికారులు జీఎంఐఎస్ శుక్ల, డీజీఎం ఐఎస్ సులాత్ బారిక్, సి.ప్రకాష్, హెచ్‌ఆర్ డీజీఎం హేమంత్‌కుమార్ హాజరయ్యారు. విద్యార్థినులకు డ్రెస్ మెటీరియల్, మిఠాయిలను పంపిణీ చేశారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్‌లోని శ్రీనిధి స్కూల్‌లో హంగామా మస్తీ- ఉమెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు.

'నిథమ్'లో..

రాయదుర్గం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిథమ్‌లో విద్యార్థినులు క్రీడలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. క్యాంపస్‌లో ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో హైటెక్‌సిటీ వెస్టిన్ హోటల్ హెచ్‌ఆర్, శిక్షణా మేనేజర్ రోమి పత్రనాబిస్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మహిళలకు కుటుంబసభ్యులంతా అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని ఇస్తే ఎంతో ప్రగతి సాధ్యమన్నారు. వన్ ట్రావెల్ పార్క్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ, భాగస్వామి హర్ష అన్నపురెడ్డి మాట్లాడుతూ కుటుంబసభ్యుల మద్దతు ఉంటే అన్ని రంగాలలో మహిళలు రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు.


నిథమ్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు


కొండాపూర్ బెటాలియన్‌లో.. కమాండెంట్ సన్నీ తదితరులు


మియాపూర్‌లో..

ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలి

శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల నిరసన


శేరిలింగంపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌లను ఉచితంగా చేయాలని గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్, జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, మంజులా రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, సింధు ఆదర్శ్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు .ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ప్రజలకు ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 25 లక్షల మంది నుంచి రూ.20 వేల కోట్లు రాబట్టేందుకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల రాఘవరావు, మంత్రి ప్రగడ సత్యనారాయణరావు, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా విజేత సూపర్ మార్కెట్

సిల్వర్ జూబ్లీ వేడుకలు


విజేత సూపర్‌మార్కెట్ వార్షికోత్సవంలో పాల్గొన్న మురకొండ జగన్‌మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, సందీప్ చౌదరి, సిద్దార్థ, ఉద్యోగులు

కూకట్‌పల్లి: విజేత సూపర్‌మార్కెట్ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రధాన కార్యాలయం చందానగర్, అమీన్‌పూర్‌లలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. 25 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వినియోగదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు, పండ్లు, వివిధ రకాల వస్తువులు, గృహోపకరణాలు అందిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్‌మోహన్ రావు తెలిపారు.

విజేత
Fresh Healthy Living

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1999 మార్చి 7న మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించి నేడు 109 బ్రాంచిలతో విజేత సూపర్ మార్కెట్ బ్రాండ్ ఐకాన్‌గా నిలిచిందన్నారు. మమ్మల్ని నమ్మిన వినయోగదారులకు మాకు అండగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో తమకు సహాయ, సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, విజేత కుటుంబంలో భాగమైన ఉద్యోగులు ఈ విజయంలో కీలకపాత్ర వహించినందుకు గర్వపడుతున్నానని అన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.
- ఈ వార్షికోత్సవం సందర్భంగా జూబ్లీ జాక్‌పాట్ లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి టాటా నెక్సాన్ కారు, ద్వితీయ బహుమతులు 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, తృతీయ బహుమతులు 25 చేతక్ ఈవి స్కూటర్లు, బోనస్ బహుమతులు 111 మంది లక్కీ విజేతలకు పానాసోనిక్ కుక్కర్లను అందజేయనున్నట్లు తెలిపారు.
- ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31వ తేదీ వరకు విజేత సూపర్‌మార్కెట్‌లో రూ.500 కొనుగోలు చేసి కూపన్ పొందిన వారు లక్కీడ్రాకు అర్హులన్నారు. వార్షికోత్సవం, మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులందరికి బహుమతులు అందజేశారు.
- ఈ కార్యక్రమంలో విజేత సూపర్‌మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్ మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి

శేరిలింగంపల్లి: మియాపూర్ సర్వే నంబర్ 28లో సీఆర్‌పీఎఫ్ క్యాంపు సిబ్బంది చేపట్టిన అదనపు నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు ఎంసీపీఐయూ మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

సామాజిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలి

రాయదుర్గం: సామాజిక సమస్యలకు స్థిరమైన పరిష్కారాలు కావాలని హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఫుర్కాన్ కమర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో భాగంగా 'టెక్నాలజీ-సొసైటీ అండ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక శాస్త్రవేత్తలు సామాజిక సమస్యలను అన్వేషించాలన్నారు. స్థిరమైన పరిష్కారాలను కనుగొనడంలో సహాయం చేయాలని సూచించారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ డైరెక్టర ప్రొఫెసర్ ధనంజయ్‌సింగ్ మాట్లాడుతూ మానవీయశాస్త్రాలు, సామాజిక శాస్త్రాల మధ్య అంతరాన్ని తగ్గించాల్సిన అవసరంపై దృష్టి పెట్టాలన్నారు. 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

రాజయోగాతో ఆరోగ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శివరాత్రి సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో గురువారం కేంద్రం నిర్వాహకురాలు బికే. నిర్మల బెహన్ ఆధ్వర్యంలో పరమాత్మ శివుని జెండా ఆరోహణను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భెల్ ఈడీ , కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, భెల్ జీఎంలు భార్గవ, సుబ్రహ్మణ్యం, కార్మిక సంఘం నాయకులు రాజునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం రాజయోగ చేయడం వలన ఆరోగ్యంతో పాటు ఉత్సాహంగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన రుద్రాక్ష లింగాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ జాతీయ మీడియా ఇంచార్జ్ బికే. సరళ బెహన్ పాల్గొన్నారు. అలాగే రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ బ్రహ్మకుమారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన 12 జ్యోతిర్లింగాల ప్రదర్శనను కార్పొరేటర్ పుష్పనగేష్ ప్రారంభించారు.

ట్రిపుల్ ఐటీ.. ఔట్ స్టాండింగ్ పేపర్ అవార్డు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధక విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కెనడాలోని వాంకోవర్‌లో ఏఏఏఐ సంస్థ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ సదస్సులో 12వేలకు పైగా పేపర్‌లను సమర్పించగా అందులో మూడింటిని మాత్రమే ఔట్ స్టాండింగ్ పేపర్ అవార్డుకు ఎంపిక చేశారు. ఆ మూడింటిలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సమర్పించిన పేపర్ కూడా ఉండడం విశేషం.

మహిళల కోసం బీ ఫిట్ విత్ ఇనార్బిట్

సాక్షి, సిటీబ్యూరో: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్ బీ ఫిట్ విత్ ఇనార్బిట్ పేరిట ఫిట్‌నెస్ సెషన్‌లను నిర్వహిస్తున్నట్లు గురువారం మాల్ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత జుంబా క్లాసెస్ నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా ఈ నెల 31 వ తేదీ వరకు కాంప్లిమెంటరీ మేక్‌ఓవర్‌లు వైద్య నిపుణులతో ఉచిత స్కిన్ కన్సల్టేషన్‌లు, కనుబొమ్మలను అందంగా తీర్చిదిద్దుకొనేందుకు తరగతులు తదితరాలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌కు ఒకరు బలి

సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన కారు


మొయినుద్దీన్ (ఫైల్)

గచ్చిబౌలి: ర్యాష్ డ్రైవింగ్‌కు ఓ ఆటో డ్రైవర్ మృత్యువాత పడ్డ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భగవాన్ కాలనీ, బీరంగూడకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ మొయినుద్దీన్(52) గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు బయటకు వెళ్లాడు. ఆటోలో స్నేహితుడు సయ్యద్ సలీంతో కలిసి లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్నారు. ఉదయం 8.45 గంటల సమయంలో హెచ్‌సీయూ బస్ డిపో సిగ్నల్ వద్ద రెడ్ సిగ్నల్ పడటంతో ఆటో ఆపాడు. మసీద్‌బండ వైపు నుంచి వేగంగా వచ్చిన స్విఫ్ట్ కారు సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి ముందుకు దూసుకెళ్లింది. దీంతో ఆటోలో డ్రైవింగ్ సీట్లో ఉన్న మొయినుద్దీన్ డివైడర్‌పై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 9.15 గంటలకు మృతి చెందాడు. ర్యాష్‌గా డ్రైవింగ్ చేసిన వ్యక్తి కొద్దిదూరంలో కారు వదిలి పరారయ్యాడు. కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల ప్రతిభ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ (పీఎంఆర్ఎఫ్) పరిశోధక విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐఐటీ ఇండోర్‌లోని పీఎంఆర్ఎఫ్ వార్షిక సింపోజియంలో తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. రాడార్ సోర్స్‌ని ఉపయోగించి రియల్ టైమ్ హిడెన్ మెటాలిక్ వస్తువులను, మాంసం తాజాదనాన్ని కొలవడంపై పరిశోధనలు చేశారు.హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొ.అనిల్‌కుమార్ చౌదరితో పరిశోధక విద్యార్థులు చందన్‌ఘోరుయ్, ముకులిక మండల్, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాశ్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి ఆర్ శారద, సుమీ రాణా డాక్టర్ ఎం ముత్తమిలరసన్‌తో కలిసి పనిచేస్తున్నారు. వారిని గురువారం హెచ్‌సీయూలో పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.